ఆగని ఆకలి కేకలు

- రోడ్డు ప్రమాదాల్లో వ్యవసాయ కూలీల మృతి
- తొక్కి చూడని అధికారులు
- ప్రభుత్వ హామీలు గాలికి...

వార్త 6వ పేజీలో

ప్రమాదాలు జరుగుతున్నా ట్రాలీ ఆటోలో కిక్కిరిసి ఎక్కిన కూలీలు (ఫైల్)

కర్నూలు పశ్చిమ ప్రాంతంలో ఆకలి కేకలు ఆగడం లేదు. ప్రతేడాది కరువు, కాటకాలకు గురై వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వలసలు ఇక్కడ సర్వసాధారణం. ఇలా వలస వెళ్లి రోడ్డు ప్రమాదాల బారిన పడి కూలీలు మృత్యు వాత పడిన సంఘ టనలు అనేకం. వీటిపై పాలకులు కానీ, ప్రభుత్వాలు కానీ స్పందించడం లేదు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల ప్రవర్తన నియమావళి, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించని 32 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎగ్జిట్/ఒపీనియన్ పోల్స్ నిర్వహించకూడదన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎపిక్ కార్డుకు బదులుగా 12 వివిధ గుర్తింపు కార్డులుంటే అనుమతి ఇస్తామని తెలిపారు. ఎపిక్ కార్డులకు సంబంధించి ఇప్పటి వరకు 2.65 లక్షలు ప్రింట్ చేసినట్లు చెప్పారు. ఇంకో 60 వేలు ప్రింటంగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిలో 2.40 లక్షలు పోస్టల్ శాఖ ద్వారా డెలివరీ చేసినట్లు చెప్పారు. ప్రింటింగ్‌లో 60 వేలు, మిగిలిన 20 వేల ఎపిక్ కార్డులను కూడా త్వరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌కు సంబంధించి రాయలసీమ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ బ్లాక్‌లో 4 నియోజకవర్గాలు, లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లో 2 నియోజకవర్గాలు, లైబ్రరీలో 2 నియోజకవర్గాలను ఏర్పాటు చేసేందుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికల విధుల్లో ఉన్న వారితో పాటు అత్యవసర సర్వీసులైన 33 శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేసినట్లు తెలిపారు. వృద్ధులు, వికలాంగులైన ఓటర్లకు సంబంధించి హోం ఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. ఈవిఎం గోడౌన్‌లో ఈనెల 12న ఈవిఎం మిషన్ల మొదటి విడతకు సంబంధించి ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. అనుమతుల జారీ విషయంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఆర్ఒ మధుసూదన్ రావు, వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.పుల్లారెడ్డి, టిడిపి ప్రతినిధి చంద్రహాస్, బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ బి.కోటేశ్వర్లు, సిపిఎం ప్రతినిధి కెవి.నారాయణ, బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జీ జి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

వంద శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ సృజన ఆదేశించారు. పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనులపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తదితరులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నగదు డ్రా చేసి ఈనెల 3న సాయంత్రం 4 గంటల నుంచి పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీని ప్రారంభించినట్లు తెలిపారు. 13 మండలాలు, అర్బన్ ప్రాంతాల్లో జిల్లా యావరేజ్ కంటే ఎక్కువ శాతం పంపిణీ చేశారని చెప్పారు. 15 మండలాలు మాత్రం జిల్లా యావరేజ్ కంటే తక్కువ శాతం పంపిణీ చేశారన్నారు. పెద్దకడబూరు, క్రిష్ణగిరి, నందవరం, మద్దికెర, వెల్దుర్తి, సి.బెళగల్ లాంటి మండలాలు 40 శాతం కంటే తక్కువ పంపిణీ చేశాయని తెలిపారు. ఎందుకు తక్కువ చేశారని సంబంధిత ఎంపిడిఒలను ప్రశ్నించారు. నగదు ఆలస్యంగా అడ్జస్ట్ కావడంతో పంపిణీ పురోగతి తక్కువ నమోదయిందని ఎంపిడిఒలు వివరించారు. గురువారం సాధ్యమైనంత వరకు పంపిణీ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. సచివాలయాల్లో ఎక్కడైనా షామియానా, తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయకపోతే, ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డిని ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు కల్పించాలని తెలిపారు.

పుస్తకాలకే పరిమితం కాకూడదు

క్విజ్ పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న విసి సుధీర్ ప్రేమ్ కుమార్

- ఆర్‌యు విసి సుధీర్ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా అన్ని విషయాలపైనా అవగాహన పెంచుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని సెట్ హాలులో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి క్విజ్ ఛాంపియన్-2024 రీజనల్ క్వాలిఫైడ్ రౌండ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సిలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి వాటిల్లో పాల్గొంటే తమ ప్రతిభ, పాటవాలను చాటుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సబ్జెక్టులోని అన్ని విషయాలపైనా ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. నాలుగు రౌండ్లలో జరిగిన క్విజ్ పోటీలకు రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లా నుంచి 14 కళాశాల బృందాలు పాల్గొన్నాయి. ఇందులో కర్నూలు జిల్లా నుంచి సెయింట్ జోసెఫ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురం నుంచి జెఎన్‌టియు కళాశాల బృందాలు సెమీఫైనల్‌కు ఎంపికయ్యాయి. రెక్టార్ ఎన్‌టికె.నాయక్, రిజిస్ట్రార్ నాగుల అంకన్న, ఉన్నత విద్యా మండలి అకాడమిక్ ఆఫీసర్ చంద్రమోహన్ రెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను
లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలి

- పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి దివ్య

ప్రజాశక్తి - పత్తికొండ

వివిధ కేసులకు సంబంధించి చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వి.దివ్య తెలిపారు. గురువారం పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు హాలులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దివ్య మాట్లాడారు. వివిధ కేసుల్లో పరిష్కరించేందుకు అవకాశం ఉన్న కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల బాధితులకు న్యాయం జరగకపోగా, సమయం వృథా అవుతోందని చెప్పారు. పత్తికొండ కోర్టులో దాదాపు 3 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మే 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఆస్తి తగాదాలు, ప్రో నోట్, చెక్ బౌన్స్, పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులకు సంబంధించినవి బాధితులతో మాట్లాడి రాజీ అయ్యే విధంగా కేసులను పరిష్కరించేలా చూడాలని తెలిపారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహేష్, ట్రెజరర్ రాజశేఖర్ నాయుడు, జాయింట్ సెక్రటరీ వాసుదేవా నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు గోపాల్ రెడ్డి, ఈరన్న, ఎల్లారెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, రమేష్ బాబు, నరసింహ చారి, నారాయణస్వామి, దామోదరాచారి, బాల బాషా, ప్రసాద్ బాబు, జటంగి రాజు, వెంకటేశ్వర్లు, సుధాకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, అరుణ్, నాగరాజు, హరికృష్ణ, పవన్, లోక్ అదాలత్ క్లర్క్ రమాదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి దివ్య

మండుతున్న ఎండలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వేసవికాలం ప్రారంభం నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం చేయరాదని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలని సూచించారు. నీరు, ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, అనారోగ్యంగా ఉన్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్నం సమయాల్లో ప్రయాణం చేయరాదని చెప్పారు. సాధ్యమైనంత వరకు చిన్న పిల్లలతో ప్రయాణం చేయరాదని తెలిపారు. ముఖ్యంగా ఇంటి వద్ద ఉండే పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారు, అనారోగ్యంతో బాధపడేవారు తరచూ నీరు తాగాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే బయట పనికి వెళ్లే వారు ఉదయం 12 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పని చేసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయంలో, గ్రామ ఆరోగ్య క్లినిక్‌లో ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేనప్పుడు వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఒక లీటరు నీటిలో నాలుగు స్పూన్ల పంచదార, అర స్పూన్ ఉప్పు కలిపిన ద్రావణం తాగడం ద్వారా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. తదుపరి వెంటనే వైద్య సేవలు తీసుకోవాలన్నారు. బస్సులు, రైలులో ప్రయాణం చేసేవారు తాగునీటిని వెంట తీసుకొని వెళ్లాలని, దాహం లేకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలని తెలిపారు. వడదెబ్బ నివారణకు వైద్య, ఆరోగ్య శాఖ అందించే సూచనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

నేడు పత్తికొండకు గఫూర్ రాక

ప్రజాశక్తి - పత్తికొండ

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ శుక్రవారం పత్తికొండకు వస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి పి.రామచంద్రయ్యను బలపరుస్తూ ఎన్నికల ప్రచారం నిమిత్తం వస్తున్నట్లు చెప్పారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఎస్సీ సెల్ చైర్మన్‌గా లాజరస్‌కు నియామక పత్రం ఇస్తున్న డిసిసి అధ్యక్షుడు బాబురావు

ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్‌గా లాజరస్

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఎండ్లూరి లాజరస్‌ను నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బజారన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దానమయ్య, రాష్ట్ర కార్యదర్శిగా కిరణ్ కుమార్, గోవిందు, పోతురాజులు నియమితులయ్యారు. గురువారం ఎస్సీ సెల్ చైర్మన్ నియామక పత్రాన్ని డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు లాజరస్‌కు అందజేశారు.

డిసిసి అధ్యక్షుడు పై విమర్శలు తగదు : డిసిసి అధ్యక్షుడు బాబురావుపై కొంతమంది కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం తగదని ఎస్సీ సెల్ చైర్మన్ లాజరస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పెండ్లిమర్రి పిఎస్ ఎస్ఐ సస్పెండ్ : డిఐజి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు కడప జిల్లా పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి.సునీల్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ కర్నూల్ రేంజ్ డిఐజి సిహెచ్ విజయరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు సకాలంలో స్పందించి సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కడప జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఇచ్చిన నివేదికల ఆధారంగా కర్నూలు రేంజ్ డిఐజి ఎస్ఐను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా పోలీసులు విధుల పట్ల అలసత్వం వహించి, క్రమశిక్షణను ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కర్నూలు రేంజ్ డిఐజి హెచ్చరించారు.

వైసిపి జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షురాలిగా 25వ వార్డు కార్పొరేటర్ గడ్డం రామకృష్ణ సతీమణి సిట్రా సత్యనారాయణమ్మను నియమించడం పట్ల కురువ సంఘం నాయకులు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సంఘం గౌరవాధ్యక్షులు కే.కిష్టన్న, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎం.కే. రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, జిల్లా మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.లీలమ్మ, కే.అనిత, జిల్లా నాయకులు కత్తి శంకర్, టి.ఉరుకుంద, బి.వెంకటేశ్వర్లు, దేవేంద్ర, పుల్లన్న, బి.సి తిరుపాలు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తవుడు శ్రీనివాసులు, బి.రామకృష్ణ తదితరులు హర్షం ప్రకటించారు.

సంపాదనలో కొంత సామాజిక సేవకు వినియోగించాలి

- సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ
- పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ పేర్కొన్నారు. గురువారం కర్నూల్ నగరంలోని గాయత్రి ఎస్టేట్లో ఉన్న గురుదత్త పాలి క్లినిక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఎంతో దీక్షతో ఉపవాస దీక్షలు చేపడతారని అన్నారు. పేద ముస్లిం కుటుంబాలు కూడా సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో తన వంతు బాధ్యతగా రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసినట్లు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక వయసు దాటిన తర్వాత సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి సేవ చేయాలన్న సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ప్రస్తుతం వేసవి మండుటెండలు అధికంగా ఉండటం వల్ల వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నీటిని అధికంగా తీసుకోవాలన్నారు. లేదంటే నీటి శాతం తగ్గిపోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే పరిశుభ్రమైన నీటిని తాగడం మర్చిపోరాదని, కలుషితమైన నీటిని తాగితే టైఫాయిడ్, జాండీస్, కలరా, విరోచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

చలివేంద్రంను ప్రారంభిస్తున్న డాక్టర్ కల్పన

ప్రభుత్వాస్పత్రిలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పత్తికొండ

వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రోగులకు చల్లటి నీళ్ల పంపిణీ చేసేందుకు పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పన చలివేంద్రం గురువారం ఏర్పాటు చేసి ప్రారంభించారు. పత్తికొండలో చలివేంద్రాలు కరువు అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వ డాక్టర్ కల్పన స్పందిస్తూ ప్రభుత్వాస్పత్రిలో చలివేంద్రంను ఏర్పాటు చేశారు. రోగులకు ఇబ్బందులు తలెత్తుకుండా సకాలంలో నీరును అందిస్తామని ఆమె తెలిపారు. చలివేంద్రాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఆది నాగేషు, ఇర్ఫాన్, సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, హెడ్ నర్స్, శాంతలక్ష్మి, దేవయ్య, రోగులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల భవనం జోలికొస్తే ఊరుకోం : సిపిఎం

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికెర మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ వెనకాల ఉన్న విఆర్‌ఎల విశ్రాంతి (సమావేశ) భవనం జోలికొస్తే చూస్తూ ఊరుకోమని సిపిఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్ హెచ్చరించారు. భవనాన్ని కూల్చి అక్కడ మార్కెట్‌ను విస్తరింపచేయాలని రాజకీయ నాయకులు చేస్తున్న ఆ చర్యలు మానుకోవాలని పేర్కొన్నారు. విఆర్‌ఎ భవనం కూల్చాలనే ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితమే అప్పుడున్న విఆర్‌ఏలు సమావేశ భవనం కావాలని చందాలు వేసుకుని నిర్మించుకున్నారని చెప్పారు. మండలంలో వారి పనులన్నీ ముగించుకుని వచ్చి ఏదైనా అవసరమైతే సమావేశం కావడానికి నిర్మించుకున్న భవనాన్ని కూల్చడం దుర్మార్గమైన చర్య అన్నారు. మార్కెట్ నిర్మాణం కోసం స్థలం కావాలనుకుంటే అక్కడికి దగ్గరలో ఉన్న పందుల కుంట దగ్గర చాలా ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉందని, అక్కడ మార్కెట్‌ను నిర్మిస్తే బాగుంటుందని, విఆర్‌ఎల భవనాన్ని కూల్చడానికి వస్తే అడ్డుకుంటామన్నారు. ఈ విషయంలో విఆర్‌ఏలకు సిపిఎం అండగా ఉంటుందని, వీలైతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడానికి కూడా వెనకాడబోమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విఆర్ఏ భవనం కూల్చాలనే ఆలోచన మానుకోవాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోడుమూరు టికెట్‌పై పునరాలోచించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి సి బెళగల్

కోడుమూరు నియోజకవర్గంలో వైసిపి నుండి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి టికెట్ కేటాయించారని, అధిష్టానం పునరాలోచించు కోవాలని ఆ పార్టీ ఇన్‌చార్జి దామోదరం రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస పార్టీ జిల్లా కార్యదర్శి శశిధర్ కుమార్, మండల అధ్యక్షులు మల్లికార్జున సమక్షంలో ఆయన కార్యకర్తలతో సమీక్షించి మాట్లాడారు. 80 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు పాటుపడుతున్నామని, టికెట్ ఎంపిక విషయంలో వలస నాయకులను ఎంపిక చేయడం వలన ఓటు శాతం పెరగదని అన్నారు. అలాగే 2019 ఎన్నికల్లో తాను పోటీలో ఉండగా అత్యధిక ఓట్లు వచ్చాయని, టికెట్ విషయంలో పునరాలోచించాలని పేర్కొన్నారు.

టిజివి కళాక్షేత్రానికి నందిని అవార్డుల పంట

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం, తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక సంస్థ సంయుక్త నిర్వహణలో నందిని అవార్డుల పోటీ జరిగింది. పద్య నాటక సాంఘిక నాటక విభాగంలో వారం రోజులపాటు జరిగిన పోటీల్లో కర్నూలు టిజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన శ్రీకృష్ణ కర్ణార్జునీయం పద్య నాటకం విజయభేరిని మోగించింది. జాతీయ స్థాయి పద్య నాటక విభాగంలో శ్రీకృష్ణ కర్ణార్జునీయం ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది. దీంతోపాటు వ్యక్తిగత విభాగంలో 6 నందిని బహుమతులు వచ్చాయి. వీరిలో వరుసగా ఉత్తమ నటుడు జీవి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి సురభి ప్రభావతి, ఉత్తమ సహాయ నటుడు పి రాజారత్నం, ఉత్తమ సహాయ నటి హసీనా, ఉత్తమ మేకప్ చింతా శ్రీనివాసులు, ఉత్తమ రచన పల్లెటి కులశేఖర్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన కళాకారులను విశ్రాంత జిల్లా కలెక్టర్ గుమ్మల్ల బలరామయ్య అభినందించారు. తెలంగాణలో జాతీయస్థాయి పద్య నాటక విభాగంలో రెండవసారి వరుసగా ఏడు బహుమతులు సాధించడం పట్ల టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు ఓబులయ్య కళాకారులను అభినందించారు.

నాటకంలోని దృశ్యం



మాట్లాడుతున్న నాయకులు

ప్రజల ఆశీస్సులతో
నాలుగో సారి గెలుస్తాం
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రజల ఆశీస్సులతో నాలుగో సారి కూడా మరింత మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని తారాపురం గ్రామంలో వెలిసిన శ్రీగిడ్డాంజనేయ స్వామిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు దీవిస్తారని తెలిపారు. రాంపురం రెడ్డి సోదరులు వలస వాదులని టిడిపి అధినేత చంద్రబాబు ప్రజాగళం యాత్రలో విమర్శించడం సబబు కాదన్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు మొత్తం వలస వాదులుగా పోటీ చేస్తున్న విషయాన్ని గుర్తించుకోవాలని తెలిపారు. ప్రజా మద్దతుతో ముగ్గురు అన్నదమ్ములం మరోసారి ఎమ్మెల్యేలుగా గెలవటాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. పెద్దకడబూరు మండలం నుంచి 15 వేల మెజారిటీ ఓట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, జడ్‌పిటిసి రాజేశ్వరి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, నౌలేకల్ నరేష్ గౌడ్, జాము మూకయ్య, భీమసేన్, కౌశిక్, చంద్రశేఖర్, వెంకటేష్, ముక్కరన్న, అర్లప్ప పాల్గొన్నారు.

ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలి : ఆర్‌ఒ

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌ఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు. గురువారం గోనెగండ్లలోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే నెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ బూత్‌ల సౌకర్యాల ప్రక్రియను దాదాపు పూర్తి చేశామని తెలిపారు. ప్రత్యేక అవసరాలు, సమస్యలు ఉన్న చోట పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ప్రజలందరూ స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని చెప్పారు. తహశీల్దార్ పార్వతి, ఎంపిడిఒ సోనీ బాయి, ఇఒఆర్‌డి నగేష్, ఆర్‌ఐ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

వాలంటీర్ల రాజీనామాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాజీనామా పత్రాలు అందిస్తున్న వాలంటీర్లు

వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతిపక్ష కూటమి తమపై కక్ష కట్టి, విధులకు అడ్డు పడుతుండడంతో మండలంలోని పెద్దతుంబలం సచివాలయం-2లో వాలంటీర్లుగా పని చేస్తున్న బుడగ జంగాల ఏకనాథ్, బలగొల్ల హుసేని ఎంపిడిఒ శేఖర్, పెద్దతుంబలం గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు గురువారం రాజీనామా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడం కోసం వాలంటీరు కొలువులో చేరామని తెలిపారు. ఇప్పుడు స్వచ్ఛందంగా రాజీనామా చేసి ప్రజాసేవలో పాల్గొనాలని రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆరెకల్ గ్రామానికి చెందిన నాగన్న, గణకల్ గ్రామానికి చెందిన సంజీవయ్య రాజీనామా పత్రాలు అందజేశారు.

ఆగని ఆకలి కేకలు

ప్రజాశక్తి-ఆలూరు

ఇటీవల ఆలూరులో బోల్తాపడిన కూలీల ఆటో (ఫైల్)

ఆలూరు నియోజకవర్గంలోని రైతులు, కూలీలు, యువత, కార్మికులు కరువు, కాటకాలతో ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సంబరాల్లో, ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోయారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలు అరకొర వర్షాలకు సరిగ్గా పండలేదు. సకాలంలో వర్షాలు కురవక రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. యువతకు ఉపాధి లేక, ఉపాధి చట్టం కూలీలకు బిల్లులు రాక, భవన నిర్మాణ కార్మికులకు, వ్యవసాయ కూలీలకు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ప్రాణాలు పోగొట్టుకొని కుటుంబాలు అనాథలు అవుతున్నా బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వాలకు, పాలకులకు, అధికారులకు చలనం లేకుండాపోయింది.

వరుస రోడ్డు ప్రమాదాల్లో కూలీలు మృతి

నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ప్రతేడాది వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తారు. వలస వెళ్తూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ప్రభుత్వాలు మాత్రం నిద్రమత్తులో మునిగి తేలుతున్నాయి. గతంలో విరుపాపురం, బిలేహాల్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీల ఆటో చింతకుంట దగ్గర బోల్తా పడగా 40 మందికి తీవ్ర గాయలయ్యాయి. అగ్రహారం గ్రామ సమీపంలో బొలేరో వాహనం బోల్తా పడగా ఆలూరు సిద్ధేశ్వర కాలనీకి చెందిన కూలీలు ఇద్దరు మృతి చెందారు. మరో 20మందికి గాయాలయ్యాయి. హొళగుంద మండలం కొత్తపేటకు చెందిన వలస కూలీలు తెలంగాణాలో పనులు ముగించుకొని బయల్దేరారు. ఆస్పరిలో బొలేరో వాహనం బోల్తా పడి 8 మంది మృతి చెందగా 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలు మరువక ముందే ఈ ఏడాది ఆలూరు మండలం హులేబీడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మిరప పంటను తెంపేందుకు వెళ్లి వస్తుండగా టాటా ఏస్ ట్రాలీ ఆటో బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. మరో 30 మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మద్దికెరకు చెందిన కూలీలు చిప్పగిరి మండలానికి మిరప పంటను తెంపేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా చికిత్స పొందుతూ కోలుకోలేక మరో ఇద్దరు మృతి చెందారు. 30 మంది కూలీలు గాయపడ్డారు. ఆదోని చాగీ గ్రామానికి చెందిన కూలీలు ఆటో నుంచి జారీ పడి ఒకరు మృతి చెందారు.

తొక్కి చూడని అధికారులు, పోలీసులు

ప్రమాదాలు జరుగుతూ వ్యవసాయ కూలీలు మృతి చెందుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బాధిత కుటుంబాలను, తీవ్రగాయాలైన క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పి ఆదుకోవాల్సిన అధికార యంత్రాంగం తొక్కి చూడడం లేదు. వాహనాలను తనిఖీ చేసి నియంత్రించాల్సిన పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంపై ప్రజలు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రభుత్వాల హామీలు గాలి మాటలే

- పి.హనుమంతు, రైతుసంఘం జిల్లా నాయకులు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం కరువుతో అలమటిస్తూ వలసలకు నిలయమైంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా వలసలను నివారించడంలో, ఉపాధి కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తూ రాజకీయ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారు. వేదవతి, నగరడోన రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తి చేస్తే కరువును శాశ్వతంగా నియంత్రించి రైతులకు, యువతకు ఉపాధి కల్పించవచ్చు. ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలి. పని ప్రదేశాల్లో మజ్జిగ, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, టార్పాన్ సౌకర్యాలు కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న 8 వారాల బిల్లులు తక్షణమే విడుదల చేయాలి.

ఏప్రిల్ నుంచి కూలీలకు వేతనం పెంపు

- శ్రీనివాసులు, ఎపిఒ, ఆలూరు

ఆలూరు మండలంలో గ్రామ, పట్టణాల్లో 5,400 జాబ్ కార్డులు ఉండగా 3,304 మంది పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న కూలీలకు ఈ నెల మొదటి నుంచి రూ.50 పెంపుతో రోజువారీ కూలి రూ.300లకు ప్రభుత్వం పెంచింది. పని ప్రదేశంలో టార్పాన్లు, నీరు ఉంటాయి. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దు. గ్రామంలోనే జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నాం.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

కాంగ్రెస్‌లోకి ఎంఐఎం అసెంబ్లీ అధ్యక్షులు

ప్రజాశక్తి - ఆదోని

ఎంఐఎం పార్టీ ఆదోని నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు ఉమ్మి యూసుఫ్ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకుని ఆయన కాంగ్రెస్‌లో చేరారు. షర్మిలను ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆమె ఉమ్మి యూసుఫ్‌కు పార్టీ కండవాను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదోని అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఉమ్మి యూసఫ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సైతం ఆదోని కాంగ్రెస్ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చిందని, అందుకే ఆయన కాంగ్రెస్ చేరారని తెలిసింది. త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయనను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటిస్తుందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉమ్మి యూసుఫ్ సోదరుడు ఉమ్మి సలీం టిడిపిలో కొనసాగుతున్నారు. ఆదోనిలో మాత్రం కాంగ్రెస్‌లో ఉమ్మి యూసుఫ్ చేరడంతో కొంతవరకు కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని, అలాగే ఇదే సమయంలో ఎంఐఎం పార్టీకి గట్టి షాక్ తగిలినట్లు అయిందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

జూదరులు అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి- దేవనకొండ

జూదరులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. భైరవకుంట గ్రామానికి చెందిన ఈడిగ రామదాస్ గౌడ్ బాడుగకు ఉంటున్న 2/77/1 నెంబర్ గల ఇంట్లో పేకాట ఆడుతుండగా దేవనకొండ పోలీసు సిబ్బంది దాడి చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈడిగ రామదాసు గౌడ్, బోయ కౌలుట్ల, వెంకటేష్, బోయ తలారి రంగస్వామి, బోయ బసవరాజు, గొల్ల తిరుపతయ్య, బోయ పెద్దయ్య, బోయ వీరేంద్రను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న నగదు రూ.14,150, ఐదు మొబైల్ ఫోన్లు, పేకముక్కలను పంచాయతీ దారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

వైసిపిలోనే మైనార్టీలకు ప్రాధాన్యత

- కోఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న సర్వర్ ఖాన్

వైసిపి ప్రభుత్వంలోనే మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించినట్లు చిప్పగిరి మండల కో ఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్, మైనార్టీ సభ్యులు సత్తార్ ఖాన్, రసూల్, షబ్బీర్ తెలిపారు. గురువారం చిప్పగిరిలో సర్వర్ ఖాన్ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వాల్లో ముస్లిం, మైనారిటీలకు 'ఇది చేస్తాం. అది చేస్తామ'ని చెప్పి మోసిగించారని, ఏనాడూ న్యాయం జరగలేదని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ముస్లిం, మైనారిటీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అన్ని పదవుల్లోనూ న్యాయం చేశారని చెప్పారు. టిడిపి, జనసేన, బిజెపిలు ప్రజలను మోసం చేయడానికి కుల సంఘాల్లో ఏదో రకంగా చిచ్చు రేపి లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. బిజెపి పాలనలో ముస్లిం, మైనార్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. గత నెలలో ఇద్దరు మైనార్టీ విద్యార్థులపై కాల్పులు చేశారన్నారు. ఆలూరు నియోజకవర్గంలో 36 వేల మంది ముస్లిం, మైనార్టీలు ఉన్నారని తెలిపారు. ముస్లిం, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చిన వైసిపి పరిపాలనను మళ్లీ తెచ్చుకోవాలంటే ఆలూరులో వైసిపి అభ్యర్థి విరుపాక్షిని గెలిపించాలని కోరారు. సుభాన్, ఖాదర్ బాషా, వెంకట రాముడు, రఘు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం

- టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రచారం నిర్వహిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం అభివృద్ధి కోసం ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య కోరారు. గురువారం కౌతాళంలోని మారెమ్మ గుడి ఏరియా, ఎస్సీ కాలనీ, శివప్ప కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలు, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టిడిపికి ఓటు వేయాలని కోరారు. అన్ని మండలాలు, అన్ని రంగాల్లోనూ వెనుక పడ్డాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయరంగాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తామన్నారు. ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు రోడ్లు వేస్తామని చెప్పారు. జగన్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి పనులు లేక వెళ్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పరిశ్రమలు వచ్చి రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. టిడిపి నాయకులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, నీలకంఠ రెడ్డి, కురువ వీరేష్, రామలింగ, చంద్ర, నూకన్న, తిక్కయ్య పాల్గొన్నారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్‌కు
అనూహ్య స్పందన

ప్రజాశక్తి - ఆదోని

'చదువుతూ.. పోరాడు' నినాదంతో, సమస్యల పరిష్కారం కోసం గళమెత్తుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు అండగా నిలుస్తూనే ఉంది. విద్యాపరంగా కూడా తమవంతు సహకారం అందించాలని ఉచిత కోచింగ్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ప్రతేడాది వేసవిలో పేద విద్యార్థుల అనుకూల సమయం మేరకు కోచింగ్‌కు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలోని విశ్వ నారాయణ జూనియర్ కళాశాలలో ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ నిర్వాణ కొనసాగుతోంది. మార్చి 21న ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి కోచింగ్‌ను ప్రారంభించారు. ఈ కోచింగ్ దాదాపు 33 రోజులపాటు ఉంటుంది. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఎంసెట్ కోచింగ్ ఏర్పాటు చేశారు. ఇంటర్ ఎంపిసి, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు ఎంసెట్ రాసేందుకు ఈ ఉచిత కోచింగ్ ఎంతో దోహదం చేసిందని విద్యార్థులు చెబుతున్నారు. షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ పేరుతో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించుకోలేక పేద విద్యార్థులు ఎంసెట్‌లో ప్రతిభను చాటలేకపోతున్నారు. అలాంటివారు ఈ కోచింగ్ నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రావీణ్యం గల ఫ్యాకల్టీ ఉందని, అర్థమయ్యే రీతిలో కోచింగ్ ఉందని చెబుతున్నారు.

కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు

పేద విద్యార్థుల సౌకర్యార్థమే

- శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

గ్రామీణ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఉచిత ఎంసెట్ కోచింగ్ ఏర్పాటు చేశాం. పేద విద్యార్థులు ప్రయివేట్ కళాశాలలు నిర్వహించే కోచింగ్‌లో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించలేక అనేక ఇబ్బంది పడుతూ మధ్యలోనే చదువులు ఆపేసిన పరిస్థితి ఉంది. వారిని దృష్టిలో ఉంచుకుని ప్రతేడాది వేసవిలో ఉచిత కోచింగ్ ఏర్పాటు చేస్తున్నాం.

అర్థమయ్యే రీతిలో చెబుతున్నారు

- ప్రశాంత్, విద్యార్థి

మాది పేద కుటుంబం. నేను పట్టణంలోని సాయి జూనియర్ కళాశాలలో చదువుతున్నాను. ఎస్ఎఫ్ఐ నాయకులు ఏర్పాటు చేసిన ఉచిత ఎంసెట్ కోచింగ్ నాకు చాలా ఉపయోగపడింది. అర్థమయ్యే రీతిలో మ్యాథ్స్ చెబుతున్నారు. కోచింగ్ కోసం సుమారు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. ఆ మొత్తాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ఈ కోచింగ్ దోహద పడింది. ఫ్యాకల్టీ కూడా అర్థమయ్యే రీతిలో విశదీకరించి చెబుతున్నారు.

మంచి వాతావరణంలో నిర్వహిస్తున్నారు

- సాహిత, విద్యార్థిని

పట్టణంలోని నోబుల్ ఒకేషన్ కళాశాలలో సైన్స్ సబ్జెక్టును చదువుతున్నాను. ఉన్నత విద్యను అభ్యసించాలని ఉంది. కోచింగ్ నిర్వహణ కోసం వేలాది రూపాయలు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎంసెట్ కోచింగ్ మంచి వాతావరణంలో నిర్వహిస్తున్నారు. సబ్జెక్టులు కూడా మంచిగా అర్థమవుతున్నాయి.

మాట్లాడుతున్న నాయకులు

60 శాతం సీట్ల కేటాయింపును స్వాగతిస్తున్నాం

- బీసీ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు 60 నుంచి 70 శాతం సీట్ల కేటాయింపును స్వాగతిస్తున్నామని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఆదోనిలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ మాన్వి దేవేంద్రప్ప అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు మరియాని చెన్న బసప్ప, రమేష్ ఆచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్షావలీ, డివిజన్ గౌరవ సలహా దారులు ఢణాపురం శేషన్న, తాలూకా గౌరవ సలహాదారులు ఎస్‌సి.రంగస్వామి, బండారి రాజేశ్వరరావు మాట్లాడారు. తాలూకా సలహాదారులు బి.రాముడు, పట్టణ గౌరవ సలహాదారుల డాక్టర్ సోమశేఖర్, తాలూకా జాయింట్ సెక్రటరీ మరాఠి వెంకటేశులు, సంజీవ్, నర్సారెడ్డి, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

భక్తులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతులు

ఆలయ ఆవరణలో ఉన్న భక్తులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. గురువారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీమఠం దివాన్ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో సేవాదారులతో మోయించారు. అనంతరం ఊయల మండపంలో ఊయలపై ఉంచి పండితుల వేద మంత్రాలతో అర్చించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఫల మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు. రాఘవేంద్రుని దర్శనార్థమై ఆరాధ్య దైవమైన మూల రాములకు పీఠాధిపతులు విశిష్ట పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు.

విలేకరులకు సహకారమందిస్తాం

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

విలేకరులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు పేర్కొన్నారు. గురువారం ఎపియుడబ్ల్యుజె జిల్లా కమిటీ పిలుపు మేరకు మంత్రాలయం తాలూకా కమిటీ, మండల కమిటీల ఆధ్వర్యంలో ఎపియుడబ్ల్యుజె టోపీలను శ్రీమఠం పీఠాధిపతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడారు. వేసవిలో విలేకరులు వార్తల సేకరణకు వెళ్తుంటారని, వారిని దృష్టిలో ఉంచుకుని ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం ఈ టోపీలను శ్రీమఠం ఖర్చుతో ముద్రించి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాలకు చెందిన 120 మంది జర్నలిస్టులకు టోపీలను పంపిణీ చేశారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, మంత్రాలయం తాలూకా అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి ఉసేని, కోశాధికారి సాబువలి, మండల గౌరవాధ్యక్షులు రానోజి రావు, అధ్యక్షులు భీమ రాయ్, ఉపాధ్యక్షులు నాగరాజు, కోశాధికారి రఫీ, ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్, సీనియర్ పాత్రికేయులు గోవిందు, ఎనుముల ఈరన్న, రామస్వామి, శ్రీధర్, కంతం నరసింహ, బాబురావు, వీరేష్, తిమ్మారెడ్డి, సతీష్, శివ పాల్గొన్నారు.

టోపీలను అందజేస్తున్న పీఠాధిపతులు

కాంగ్రెస్‌లో చేరిన జాఫర్ రహీం

పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు జాఫర్ రహీం కాంగ్రెస్‌లో చేరారు. గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నీలకంఠప్ప ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నీలకంఠప్ప, సీనియర్ నాయకులు దిలీప్ ఢోకా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాఫర్ రహీం మాట్లాడారు. రాహుల్ గాంధీకి బాసటగా ఉండాలని పార్టీలో చేరారని తెలిపారు. పార్టీకి ఎవరికి టికెట్ కేటాయించిన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారుతీరావు, సాయినాథ్, మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
O.S.No.350/2022

Andhra Pragathi Grameena Bank
Rep by its Manager Veldurthi. ...Plaintiff

Vs

1) దేశాయి రవింద్రనాథ్ రెడ్డి
తండ్రి సుబ్బారెడ్డి
2) దేశాయి మహింద్ర రెడ్డి
తండ్రి డి.విజయమోహన్ రెడ్డి
Both R/o లక్ష్మీనగరం గ్రామం, (ఎల్.నగరం),
వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా. ...Defendant

ప్రతివాదులకు సమన్స్

పై దావా వాది బ్యాంకు అప్పు రాబట్టు కొనుటకు గాను దావా దాఖలు చేసినారు. మీరు దావా సమన్స్ తీసుకొనక తప్పించుకొనుచున్నారు. కావున మీరు పై కోర్టు నందు 25-04-2024 వ తేదిన ఉదయం 10.30 గంలటకు మీరు కాని మీ తరపు వకీలు గారు గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోన వచ్చును. లేనంతట మీ పరోక్షమందు తీర్మాణించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది:25/04/2024

M.GOPAL REDDY, B.COM, B.L.,
ADVOCATE,
DHONE - 518 222,
NANDYAL DIST.
CELL : 9440557898

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు : కర్నూలు అట్ ఆదోని
E.P.No.262/2018 in A.A. No: 74/2017

Between:
శ్రీ మల్లికార్జున ఫైనాన్స్, Repd.. by its Proprietor E.గుర్రెడ్డి, S/o. తిమ్మారెడ్డి, Hindu aged about 51 Years, H.No:23-493, చిన్నమార్కెట్ రోడ్, ఆదోని టౌన్, కర్నూలు జిల్లా. ...Decree holder

V/s

K.Veeranna Died by Lrs. ...Judgement Debtors

SALE NOTICE UNDER ORDER 21 RULE 64 & 66 C.P.C

To
JDR 3: K.Jyothirmie D/o Late K.Veeranna Hindu, aged about 24 Years
JDR 4: K.induja D/o Late K.Veeranna, Hindu, aged about 22 Years Both are resident of H.No:1/1696-1, Gandhi Nagar, Yemmiganur Town, Kurnool Dist

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై తెలిపిన డిక్రీహోల్డర్ శ్రీ మల్లికార్జున ఫైనాన్స్ Repd.. by its Proprietor E.గుర్రెడ్డి E.P. అమౌంట్ బాకీ వసూలు నిమిత్తం Judgement debtors కి సంబందించి EP schedule ప్రాపర్టీ ని వేలం కి తీసుకురావడం జరిగింది. ఈ case వాయిదా 26-04-2024 ఉదయం 10.30 పైన్ కనపరచిన కోర్ట్ నందు JDR 3&4 మీరు స్వతహాగా కానీ లేదా అడ్వకటే ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలెను. లేని పక్షంలో court వారు Exparte ఉత్తర్వులు జారీ చేసేదరు.

వాయిదా తేది : 26-04-2024

(కోర్టువారి ఆర్డర్ మేరకు)

శ్రీ పి.రాజేంద్ర ప్రసాద్,
డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్,
ఆదోని- 518301
సెల్ : 9440596447